క్లుప్తంగా

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ:పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంచికచర్ల : సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నందిగామ: రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రామిరెడ్డిపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు లగడపాటి వీరయ్య పేర్కొన్నారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు ఆదివారం రాత్రి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన 61 గ్రూపులకు చెందిన 660 మంది సభ్యులకు ఆసరా ద్వారా రుణమాఫీ జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఒక్క చిన్న గ్రామంలోనే మూడు కోట్ల వరకు రుణమాఫీ జరిగిందని గ్రామ నాయకులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కంచికచర్ల: మండల కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు సోమవారం చెక్కులు అందిస్తామని ఎంపీడీఓ కె.బాలశంకరరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, డీఆర్‌డీఏ పీడీ సునీత హాజరవుతారని తెలిపారు. 1,465 సంఘాలకు రూ. 13, 38 కోట్లు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు

వీరులపాడు:వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సోమేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని దొడ్డదేవరపాడు తోటమూల వద్ద ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఆటోవాలాలు పరిమితి మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని ఎస్ హెచ్ ఓ సతీష్ హెచ్చరించారు. పట్టణ పరిధిలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రౌడీషీటర్ కూడా మంచి నడవడిక అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా రౌడీ షీట్ ఉన్నవాళ్లు గొడవలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రకారం జిల్లా బహిష్కరణకు కూడా గురికావాల్సి వస్తుందన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ పరిస్థితులను అర్థం చేసుకొని మెలగాలని హితవు పలికారు. ఎస్‌ఐ పండు దొర, ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

కంచికచర్ల: మద్యం మత్తులో వేగంగా బైక్ నడపటంతో అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గొట్టుముక్కల రోడ్డులో పి.ఏసుబాబు అనే వ్యక్తి మద్యం పూటుగా తాగి బైక్‌ను వేగంగా నడిపాడు. దీంతో అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ముందుగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, యువత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా ఇచ్చిన హామీలు విస్మరించకుండా ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని రకాలుగా ప్రజలకు మంచి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నల్లాని అయ్యన్న, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, బండారుపల్లి కపిల్, పలువురు నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరంగా డంపింగ్ యార్డు

- వర్మీ కంపోస్టు సిద్ధం
- కూరగాయలు, పూలమొక్కల పెంపకం



తయారైన వర్మీ కంపోస్టును చూపిస్తున్న సర్పంచ్ పద్మకుమారి



కూరగాయలు, పూలమొక్కల నడుమ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

పెనుగంచిప్రోలు:డంపింగ్ యార్డు అంటే దుర్వాసన...ఎక్కడ చూసినా వ్యర్థాలు, అపరిశుభ్ర వాతావరణం అనే భావన ఉంటుంది. పెనుగంచిప్రోలులో మాత్రం అందుకు భిన్నంగా గ్రామ పంచాయతీ నిర్వహణలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఎంతో సుందరంగా తీర్చిదిద్దుకుంటోంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎటువంటి ఆలనా పాలనా లేకుండా మురుగు కూపంగా ఉన్న ఈ కేంద్రం నేడు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. నాడెప్ తొట్లు, వర్మీ కంపోస్టు తయారీకి పిట్లు ఏర్పాటు చేశారు. డంపింగ్ యార్డు పైన రేకులు, ఫ్లోరింగ్ అభివృద్ధి చేశారు.

ఆహ్లాదకర వాతావరణం...

చెత్త సంపద కేంద్రం చుట్టూ అందమైన పూలమొక్కలు వేయటంతో ఆహ్లాదకర వాతావరణం కలిగిస్తోంది. వంగ, టమాటా, ఆకుకూరలు, బంతిపూల కూడా సాగు చేసి పంచాయతీకి ఆదాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు మొక్కలు నాటటం, వాటిని సంరక్షించటం ధ్యేయంగా కృషి చేస్తున్నామని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి చెప్పారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి తెచ్చేందుకు 250 ఇళ్లకు ఒక క్లాప్ మిత్ర చొప్పున గ్రామంలో మొత్తం 16 మంది ఉన్నారని పేర్కొన్నారు. కూరగాయల వ్యర్థాలు వంటి తడి చెత్తను నాడెప్ తొట్లలో 60 రోజుల పాటు కుళ్ల పెడతామన్నారు. తరువాత దానిని మరో తొట్టిలో వేసి పైన పేడతో కప్పెడతామని తెలిపారు. 20 రోజుల తరువాత వానపాములు వేసి పైన పట్టాలు కప్పి తడపటం వలన వర్మీ కంపోస్టు తయారవుతుందన్నారు. ప్రస్తుతం నాణ్యమైన వర్మీ కంపోస్టు ఎరువు సిద్ధంగా ఉందన్నారు. కిలో రూ.10 చొప్పున కావాల్సిన రైతులకు విక్రయిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఆదిశంకరుల జయంతి నిర్వహించాలి



ఆదిశంకరులకు పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

విజయవాడకల్చరల్: రాష్ట్ర స్థాయిలో జగద్గురువులు ఆదిశంకరుల జయంతిని నిర్వహించడానికి కృషి చేయాలని, ఈ మేరకు దేవదాయ శాఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించాలని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ కోరారు. దేవాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 25వ తేదీ ఆదిశంకరుల జయంతి నిర్వహిస్తామన్నారు. భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆదిశంకరుల పాత్ర చిరస్మరణీయమైనదని చెప్పారు. సంస్కృతిని పరిరక్షించడం కోసం దేశంలో నాలుగు పీఠాలను ఆయన స్థాపన చేశారన్నారు. వారి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం వల్ల ఉత్సవ శోభ కలుగుతుందని అది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు, ఇతర అధికారులను లేఖ ద్వారా సంప్రదించామని తెలిపారు. దీనిపై సానుకూలమైన ప్రకటన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాలకమండలి సభ్యుడు గండూరి చంద్రమౌళీశ్వర శర్మ మాట్లాడుతూ.. సోమవారం శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థ మహాస్వామి జన్మదినం సందర్భంగా ఆయుష్యహోమం, మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని శ్రీ కోదండ రామస్వామి వారి 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రామాయణపు సాంబశివరావు తెలిపారు. పటమటలోని ఆలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 28న అష్టోత్తర శత కలశాభిషేకం, సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రపారాయణం, పూర్ణాహుతి 29న రాయబారోత్సవం, సుందరకాండ పారాయణం నిర్వహిస్తామన్నారు. 30న కోదండ సీతారామస్వామి వార్ల కల్యాణ మహోత్సవం 31న సాయంత్రం అన్న సమారాధన కార్యక్రమం, వచ్చే నెల 1న మహాపరాహుతి, పవళింపు సేవ.. 2న రథోత్సవం, లడ్డు వేలం నిర్వహిస్తామన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆలయ ప్రధాన పూజారి కేశవాచార్యులు, కమిటీ ప్రధాన కార్యదర్శి పురంశెట్టి వెంకట రమణారావు, కోశాధికారి నాగిశెట్టి మురళీ బాబు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు దీవెన ఫౌండేషన్ సాయం



నగదు అందజేస్తున్న కల్యాణ్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనారోగ్యంతో మంచానికే అంకితమై మరణించిన ఒక మహిళ అంత్యక్రియల నిమిత్తం విజయవాడ సిటీ పోలీసులు స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. విజయవాడ ఆటోనగర్‌లో నివసించే ఫారూఖ్, షాహిన ప్రైవేట్ పాఠశాలలో టీచర్లుగా పని చేసేవారు. దురదృష్టవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త ఫారూఖ్‌కు కాలు పోగా భార్య షాహిన నడుము విరిగి మంచానికే పరిమితం అయ్యింది. ఈ క్రమంలో ఆదివారం షాహిన మరణించడంతో ఆమె అంత్యక్రియలకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతూ దీవెన ఫౌండేషన్ సభ్యులను ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన వారు విజయవాడ సిటీ పోలీసుల తరపున 10 వేల రూపాయలను షాహిన అంత్యక్రియలకు అందజేశారు. దీవెన ఫౌండేషన్ సభ్యులు పటమట హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్ వెళ్లి నగదు అందించారు.

కొనసాగుతున్న జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ పోటీలు

కంచికచర్ల: కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కే సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు ఆదివారం జరిగిందని ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. మొదట మ్యాచ్ మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల తాడేపల్లిగూడెం సాసి కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి ఎల్‌బీఆర్‌సి కళాశాల జట్టు బ్యాటింగ్ చేసింది. ఆ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 124 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సాసి కళాశాల జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 84 పరుగులకే ఆలౌంటైంది. రెండో మ్యాచ్ చీరాల సెయింట్ ఆన్స్ కళాశాల గుడివాడ వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల జట్ల మధ్య జరగాల్సి ఉంది.

అయితే గుడివాడ జట్టు పోటీలో పాల్గొనకపోవటంతో సెయింట్ ఆన్స్ జట్టు గెలిచిందని ప్రకటించారు. ఈ మ్యాచ్‌లకు అంపైర్లుగా సహదీష్, ఏ ప్రశాంతి, అశోక్‌రెడ్డి వ్యవహరించారని శౌరయ్య తెలిపారు.

నేడు కంచికచర్లలో మహిళా మార్ట్ ప్రారంభం

కంచికచర్ల: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వైఎస్సార్ చేయూత మార్ట్ సోమవారం ప్రారంభిస్తామని ఎంపీడీఓ కె.బాల శంకరరావు ఆదివారం తెలిపారు. ఈ మార్ట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతులమీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. తక్కువ ధరకు గృహావసరాలకు సంబంధించిన సరుకులు విక్రయిస్తారన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులంతా కలసి ఈ మార్ట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.

రామిరెడ్డిపల్లిలో శిలువ మార్గం



నందిగామ:మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం శిలువ మార్గం జరిగింది. పలు గ్రామాల విశ్వాసులు, యేసు మాలదారులు శిలువని మోసుకుంటూ గ్రామ సమీపంలోని కొండపై వరకు యాత్ర నిర్వహించారు. అనంతరం పలువురు దైవ సేవకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏటి పట్టున ఉన్న పలు గ్రామాల విశ్వాసకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వీధి దీపాలు ప్రారంభం

నందిగామ: జగనన్న కాలనీలు దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ ఏటిపట్టు గ్రామాల మండల కన్వీనర్ దేవినేని రామారావు తెలిపారు. మండలంలోని కొండూరు గ్రామంలో జగనన్న కాలనీల్లో ఏర్పాటుచేసిన వీధి దీపాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదవారి కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. సర్పంచ్ కొర్రపాటి అచ్చారావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పికట్ల సురేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవినేని నాగేశ్వరరావు, పార్టీ యువజన విభాగ నాయకుడు తోట సురేష్, బెల్లంకొండ సురేష్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫాదర్ పెజ్జోని విగ్రహావిష్కరణ



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): పెజ్జోనిపేట ఆర్సీఎం చర్చి ఆవరణలో ఫాదర్ పెజ్జోని విగ్రహాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మత విశ్వాసాలకు అతీతంగా నాడు ప్రజలందరిని ఏకం చేసేందుకు ఫాదర్ పెజ్జోని ఎంతో కృషి చేశారన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి దోహదపడ్డారని చెప్పారు. పేదలకు అండగా నిలిచి వారికి ఆర్థికంగా చేయూతను అందించటంతో పాటు విద్య, వైద్య పరంగా ఎంతో సహాయ సహకారాలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు థామస్, మాథ్యూస్, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

రూ.50 వేల చోరీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బ్యాంక్ సెంటర్ పాలబూత్‌లో సినీ పక్కీలో చోరీ జరిగింది. శేఖర్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా విజయా డెయిరీ పాలబూత్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున డెయిరీ సిబ్బంది వాహనంలో వచ్చి పాల పదార్థాలు దిగుమతి చేశారు. తిరుగు ప్రయాణంలో నగదు తీసుకెళ్లారని భావించిన యజమాని వారి కోసం రూ.50 వేలు సిద్ధం చేసి పేపర్‌లో చుట్టి బూత్‌లోని ఓ బుట్టలో పెట్టాడు. వ్యాపారుల నిమిత్తం బైటకు వచ్చిన మరుక్షణం ఇద్దరు వ్యక్తులు ఆ నగదు దోచుకెళ్లారు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయగా బైక్‌పై పరారయ్యారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా నిందితులు ఆ చోరీకి 10 నిమిషాల ముందు అక్కడే తిరిగినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

ప్రభుత్వ విప్ ఉదయభాను



టీచర్స్ కోపరేటివ్ సొసైటీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ఉదయభాను



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్:ప్రభుత్వ ఉపాధ్యాయులకు రుణాలు అందజేస్తూ వారి ఆర్థిక పురోగతి, సంక్షేమానికి టీచర్స్ కోపరేటివ్ సొసైటీ చేస్తున్న కృషి ఆదర్శనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ది జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల జిల్లా పరిషత్ స్కూల్స్ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పై అంతస్తు కమ్యూనిటీ హాల్‌ను ఉదయభాను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. దానికి ఉపాధ్యాయులంతా ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. అలాగే టీచర్స్ సొసైటీ సభ్యులకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి వారు గృహాలు నిర్మించుకునేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జగ్గయ్యపేట పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ జిల్లాలోనే మేటి పట్టణంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, కాశికిషోర్, తన్నీరు నాగేంద్ర, సీఐ అడపా నాగమురళి, టీచర్స్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ శెట్టి దుర్గాప్రసాద్, పాలకవర్గ సభ్యులు యంత్రాతి మల్లేశ్వరరావు, బీఎల్.రామారావు, ఎంఈవోలు రవీంద్ర, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సేవలో కేడీసీసీ బ్యాంక్

భీమవరం(వత్సవాయి): కేడీసీసీ బ్యాంకు రైతులకు అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. ఆదివారం గ్రామంలో రూ.44 లక్షలతో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనాన్ని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ భీమవరం సొసైటీ నూరు శాతం వసూళ్లు సాధించి ఉత్తమ అవార్డులు అందుకుందని చెప్పారు. డ్వాక్రా రుణాలతో పాటు కర్షకమిత్ర, ఎల్‌టీ, ఎడ్యుకేషన్, గృహ రుణాలను కమర్షియల్ బ్యాంకు కంటే ఎక్కువగా ఇస్తున్నాయని తెలిపారు. తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సొసైటీలకు అభివృద్ధికి పాటుపడాలన్నారు. మాజీ డీసీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భీమాల సుజాత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, సొసైటీ అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాసరెడ్డి, కొండబోలు బ్రహ్మం, గుండం రంగారెడ్డి, కనగాల రమేష్, కాటేపల్లి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ. 70 వేల విరాళం..

గౌరవరం(జగ్గయ్యపేట):గ్రామంలో జేసీఎస్ మినిస్ట్రీస్ చర్చి నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను రూ. 70 వేల విరాళాన్ని ఆదివారం చర్చి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గోవా రామకృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, జగదీష్, నర్సిరెడ్డి, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా నాగేంద్రస్వామి తిరునాళ్ల



పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



పుట్టస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న సమారాధన చేస్తున్న దృశ్యం

కంచికచర్ల: మండల కేంద్రంలోని జుజ్జూరురోడ్డులో గల నాగేంద్రస్వామి పుట్ట తిరునాళ్లు ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కులమతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు అందరూ కలసి వచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు పుట్టవద్దకు విశేషంగా తరలివచ్చారు. ముస్లింలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నాగేంద్ర స్వామి చిత్రపటంను ప్రభపై ఉంచి కొంతమంది భక్తులు పుట్టవద్దకు విచ్చేశారు. పాల పొంగళ్లు, పాయసం వండుకుని స్వామి వారికి సమర్పిస్తారు. చిన్నారులకు చెవు పోగులు కుట్టించారు. ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు భక్తులకు అన్న సమారాధన చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. సర్పంచ్ వేల్పుల సునీత, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెద బాబు, నాయకులు నన్నపనేని నరసింహారావు, నంబూరు నరసింహారావు, కాలవ వాసుదేవరావు, ఉప్పు స్వామి, వేల్పుల శ్రీనివాసరావు, మంగినేని శ్రీనివాసరావు, గ్రంధి ఆదిత్య, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.


త్రిశక్తి పీఠంలో సంపంగి పూలతో అర్చన



విశేష అలంకారంలో అమ్మవార్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో శోభకృత్ నామ సంవత్సర వసంత నవరాత్రుల సందర్భంగా ఆదివారం శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు 3 వేల సంపంగి పూలతో విశేషంగా అర్చన, పూజలు జరిపించారు. ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయ్‌కిరణ్, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.జగదీష్, జి.పుల్లయ్య, ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు, సభ్యుడు జి.సత్యం పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం హర్షణీయం



మైలవరం: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించడం చారిత్రక ఘట్టమని వసంత ఫౌండేషన్ చైర్మన్, క్రిస్టియన్ మైనారిటీ మైలవరం నియోజకవర్గం అధ్యక్షుడు బుర్రి ప్రతాప్ తెలిపారు. మైలవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బుర్రి ప్రతాప్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో దళిత క్రైస్తవులను గుర్తించి బిల్లు ప్రవేశపెట్టినపుడు ఆనాడు కేంద్రం పట్టించుకోకుండా పెండింగ్ పెట్టిందని పేర్కొన్నారు. తండ్రిని మించిన తనయుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని దళిత క్రైస్తవులు మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేయడం దళిత క్రైస్తవులకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీ మండల అధ్యక్షుడు రెవరెండ్ సాల్మన్‌రాజు, రెవరెండ్ బుద్దే సీమోను, పాస్టర్ వై.ప్రభుదాస్, ఎం.దేవానందం, పాస్టర్ డి.రాజేష్, పాస్టర్ వైజాన్, పాస్టర్ బెంజిమెన్ పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో జరిగే ఈ లెక్కింపులో సిబ్బందితో పాటు ఔత్సాహికులు పాల్గొనవచ్చన్నారు.